ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

# నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక - 66 పేజీలు - 04 వెల - 04/- ఆదివారం 15 డిసెంబర్ 2024

# రైతుల 'ఢిల్లీ ఛలో'

## .. మరోసారి ర్యాలీ నిలిపివేత

శంభు సరిహద్దులో మరోసారి ఉద్రిక్త వాతావరణం

రైతుల 'ఢిల్లీ ఛలో'ను అడ్డుకున్న భద్రతా సిబ్బంది

రైతులను చెదరగొట్టేందుకు బాష్పవాయు ప్రయోగం




ఆంధ్ర ప్రగతి న్యూఢిల్లీ డిసెంబర్ 14:
కనీస మద్దతు ధరకు చట్టబద్ధతతో పాటు పలు డిమాండ్ల సాధనే లక్ష్యంగా రైతులు శనివారం పునఃప్రారంభించిన 'ఛలో ఢిల్లీ' ర్యాలీలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. రైతుల పాదయాత్రను భద్రతా సిబ్బంది అనుమతించలేదు. హర్యానా-పంజాబ్ సరిహద్దులో రైతులను చెదరగొట్టేందుకు హర్యానా పోలీసులు టియర్ గ్యాస్, వాటర్ ఫిరంగులను ప్రయోగించారు. ఈ పాదయాత్రలో 101 మంది రైతులు పాల్గొనగా దాదాపు 10 మంది రైతులు గాయపడ్డారు. దీంతో మరోసారి 'ఛలో ఢిల్లీ' యాత్రను నిలిపివేస్తూ రైతులు నిర్ణయించుకున్నారు.కాగా, కాంగ్రెస్ నేత, మాజీ రెజ్లర్ బజరంగ్ పునియా శంభు సరిహద్దులో రైతులను కలిసి మాట్లాడారు. రైతులను అడ్డుకోవడం లేదని చెబుతూనే బాష్పవాయువు ప్రయోగిస్తున్నాయని ఆయన మండిపడ్డారు. శంభు సరిహద్దును పాకిస్థాన్ సరిహద్దులా వ్యవహరిస్తున్నారని, రైతు నేతలు ఢిల్లీ వెళ్లి నిరసన తెలిపేందుకు అనుమతి తీసుకోవాలా అని ప్రశ్నించారు.

# జమిలి వచ్చినా మార్పుండదు

- మీడియాతో ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఒక దేశం, ఒకే ఎన్నిక విధానానికి మా మద్దతు
- రాష్ట్రంలో సుస్థిర ప్రభుత్వం కొనసాగుతోంది
- స్వర్ణాంధ్ర విజన్ 2047ను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- వైసీపీ నేతలు ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయారు
- వైసీపీ నాటకాలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు

**2029 లోనే ఎన్నికలు**



ఆంధ్ర ప్రగతి అమరావతి డిసెంబర్ 14:
ఒక దేశం, ఒకే ఎన్నిక విధానానికి ఇప్పటికే మద్దతు ప్రకటించామని.. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మీడియాతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ఈ సందర్భంగా జమిలి ఎన్నికలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జమిలి అమల్లోకి వచ్చినా, ఎన్నికలు జరిగేది 202 9లోనే అని చెప్పారు. వైసీపీ పబ్బం గడుపుకోవడానికి ఏదిపడితే అది మాట్లాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'వైసీపీ నేతలు ప్రజల్లో ఎప్పుడో విశ్వసనీయత కోల్పోయారు. వైసీపీ చేసే నాటకాలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. రాష్ట్రంలో సుస్థిర ప్రభుత్వం కొనసాగుతోంది. స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యుమెంట్‌ను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి. వర్సిటీలు, కళాశాలలు, పాఠశాలలతో పాటు ప్రతిచోటా చర్చ జరగాలి. విజన్ 2020 సాకారమైన తీరు నేటి తరం తెలుసుకోవాలి. గత పరిస్థితులను బేరీజు వేస్తే విప్లవాత్మక మార్పులు అందరికి కనిపిస్తున్నాయి' అని చంద్రబాబు వివరించారు. '2047 లోనూ ఇదే పునరావృతం అవుతుంది. స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యుమెంట్ ఒక రోజు పెట్టి వదిలేసేది కాదు.

మిగతా 2లో

## సభ్యత్వ నమోదులో టీడీపీ సరికొత్త రికార్డు..!

4లో

-73 లక్షలకు చేరుకున్న తెలుగుదేశం పార్టీ సభ్యత్వాలు.

-క్యాడర్, నాయకులకు సీఎం చంద్రబాబు అభినందనలు.

-టాప్ - 5లో రాజంపేట, నెల్లూరు సిటీ, కుప్పం, పాలకొల్లు, మంగళగిరి నియోజకవర్గాలు.

-నూతన సభ్యత్వాలకు తోడు పెద్ద సంఖ్యలో యువత, మహిళల మెంబర్ షిప్.

క్యాడర్ వెల్ఫేర్ తో పాటు పొలిటికల్, ఎకనమిక్ ఎంపవర్మెంట్ కోసం ప్రణాళికలు.

- టీడీపీ అధినేత, సీఎం నారా చంద్రబాబు

# వైసీపీ నాయకులు ధాన్యం బస్తాలతో వెళ్లి ఫొటోషూట్లు చేశారు

- 'అన్నదాతకు అండగా వైసీపీ' నిరసనలపై
- మంత్రి నాదెండ్ల మనోహర్ సెటైర్లు
- కూటమి ప్రభుత్వం ఎప్పుడూ రైతుల పక్షానే
- వైసీపీ ప్రభుత్వ బకాయిలను కూడా చెల్లించామని వెల్లడి



ఆంధ్ర ప్రగతి అమరావతి డిసెంబర్ 14:
కూటమి ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరిస్తూ.. అండగా ఉంటుందని ఏపీ పౌర సరఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. వైసీపీ నేతలపై ట్విట్టర్(ఎక్స్) వేదికగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరు రైతులకు భరోసాగా నిలుస్తున్నారో ప్రజలందరికీ తెలుసునని అన్నారు. వైసీపీ పాలనలో గత ఖరీఫ్ సీజన్లో డిసెంబర్ 13నాటికి- 9,40,936 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే సేకరణ చేసిందని.. కూటమి ప్రభుత్వం ఈ ఖరీఫ్ సీజన్లో ఇప్పటి వరకూ 16,34,151 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించిందని వివరించారు. కలెక్టరేట్ల దగ్గరకు బస్తాలు మోసుకువెళ్లి వైసీపీ నేతలు ఫొటోషూట్ చేశారని విమర్శించారు. గత సీజన్లో గుంటూరు, విశాఖపట్నం, అనకాపల్లి, అనంతపురం, ప్రకాశం జిల్లాల్లో కనీసం సేకరణ ఎందుకు చేపట్టలేదని అన్నారు. కాగా.. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ధాన్యం కొనుగోలులో అనేక సంస్కరణలు తీసుకువచ్చినట్లు తెలిపారు.

మిగతా 2లో

## మళ్లీ అరచేతిలో వైకుంఠం చూపిస్తున్న బాబు

విజన్లు కాదు.. విభజన హామీలు కావాలి

ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల విమర్శలు



2లో

## మనకు తెలిసిన, మనం చూసిన ఏకైక యుగపురుషుడు ఎన్టీఆర్

: సీఎం చంద్రబాబు

పోరంకిలో ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుక



4లో

# జగన్ ఆస్తుల కేసులో విచారణ వాయిదా

- సుప్రీంకోర్టుకు సీబీఐ, ఈడీ నివేదిక
- అక్రమాస్తుల కేసు బదిలీ, బెయిల్ రద్దుపై విచారణ
- జనవరి 10కి తదుపరి విచారణ వాయిదా

ఆంధ్ర ప్రగతి అమరావతి డిసెంబర్ 14:
మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆయన కేసులకు సంబంధించిన వివరాలతో కూడిన నివేదికను సుప్రీం కోర్టుకు సీబీఐ, ఈడీ అందజేశాయి. ఆ నివేదికను పరిశీలించిన తరువాతే తీర్పు ఇస్తామని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. అనంతరం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసుల బదిలీ, బెయిల్ రద్దు పిటిషన్లపై విచారణ జనవరి 10 వాయిదా పడింది.



మిగతా 2లో

## రాజ్యాంగ ఔన్నత్యాన్ని దెబ్బతీసేందుకు కాంగ్రెస్ ప్రయత్నించింది

రాజ్యాంగ నిర్మాతల కృషిని మట్టిపాలు చేసేందుకే కాంగ్రెస్

మన రాజ్యాంగం ఎన్నో దేశాలకు స్ఫూర్తిగా నిలిచిందన్న ప్రధాని

ఈ దేశాన్ని ఒక కుటుంబం 55 ఏళ్లు పాలించిందన్న మోదీ

ఆ కుటుంబం రాజ్యాంగాన్ని ఖూనీ చేసేందుకు ప్రయత్నించిందని విమర్శ



2లో

## వైసీపీ నాయకులు ధాన్యం బస్తాలతో వెళ్లి ఫొటోషూట్లు చేశారు

(మొదటి పేజీ తరువాయి)
వైసీపీ ప్రభుత్వం రైతులకు బకాయిలు చెల్లించకుండా వారిని మోసం చేసిందని ఆయన ఆగ్రహించారు. గత ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను సైతం చంద్రబాబు సర్కారే చెల్లించినట్లు మంత్రి నాదెండ్ల వెల్లడించారు. ఈ ఏడాది సంక్రాంతి రాకముందే రైతులు కళ్లల్లో ఆనందం కనపడుతోందని మంత్రి చెప్పారు. రైతులకు అండగా నిలబడకపోతే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లక్షల కోట్ల బడ్జెట్ వృథాగా మారుతుందన్నారు. అందుకే వారిని ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎప్పుడూ రైతుల గురించే ఆలోచిస్తారని తెలిపారు. వారికి మంచి చేయాలనే ఉద్దేశంతో నిరంతరం కష్టపడుతున్నారని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో కంటే కూటమి ప్రభుత్వంలో ధాన్యం దిగుబడి అధికంగాఉందన్నారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తే ఎక్కువ మందికి ఉపాధి కల్పించే అవకాశం ఉంటుందన్నారు. ధాన్యం అమ్మకాల్లో రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని చెప్పారు. అలా ఆందోళన చెంది దళారులకు తక్కువ ధరకే విక్రయించవద్దని అన్నారు. రైతులకు కనీస మద్దతు ధర దక్కాల్సిందేనని అన్నారు. అందుకు ప్రభుత్వం అన్నీ చర్యలు చేపట్టిందని... ధాన్యంలో తేమ 20 శాతం వరకు ఉన్నా కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. వర్షం వస్తే ధాన్యం తడిసిపోకుండా రైతులకు అందించేందుకు టార్పాన్లు సైతం మొదటిసారి అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. మిల్లర్లకు ఇవ్వాల్సిన బకాయిలను చెల్లించామని అన్నారు. కాబట్టి వారంతా రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. రైతులను ఇబ్బంది పెట్టినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు.ఉంటే ఏపీలో 2.45లక్షలు ఉండతానికి కారణం జగన్ కాదా అంటూ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

## ఇంకా జగన్ లో మార్పు రాలేదా..?



ఆంధ్ర ప్రగతి అమరావతి డిసెంబర్ 14: వైసీపీ అధినేత జగన్ చేస్తున్న పనులు సొంత పార్టీ వారికే కోపం తెప్పిస్తున్న విషయం తెలిసిందే. 'జగన్‌లో మార్పు రావాలి' అని చాలా మంది నాయకులు చెబుతున్నారు. అయినా.. జగన్ మాత్రం ఎక్కడా మారక పోవడం గమనార్హం. దీనికి తాజాగా జరిగిన పరిణామమే ఉదాహరణ. రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం వైసీపీ నేతలను రంగంలోకి దింపారు జగన్. కూటమి సర్కారు రైతులకు అన్యాయం చేస్తోందని.. దీనిపై పోరాడాలని ఆయన పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా నాయకులు ధర్నాలు నిరసనలు చేస్తున్నారు. మరోవైపు గుంటూరు, రాజమండ్రి లాంటి ప్రాంతాల్లో కలెక్టర్ కార్యాలయాల వద్ద ఆందోళనకు దిగిన వైసీపీ నాయకులను పోలీసులు అదుపు లోకి తీసుకున్నారు. అంతేకాదు.. కొందరిని అరెస్టు చేసినట్టు ప్రచారం కూడా జరుగుతోంది. ఇంత కీలకమైన సందర్భంలో జగన్ ఏం చేయాలి? పార్టీ అధినేతగా వారిని ముందుండి నడిపించాలి. లేదా.. తాడేపల్లిలో అయినా.. ఉంది దిశానిర్దేశం చేయాలి.కానీ, ఈ రెండు విషయాలను వదిలేసిన జగన్.. తాను ఎంచక్కా బెంగళూరుకు వెళ్లిపోయారు. ఒకవైపు శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీనేతలను ధర్నాలకు, నిరసనలకు దిగాలని చెప్పిన పార్టీ అధినేత ఇలా బెంగళూరుకు చడీ చప్పుడు లేకుండా వెళ్లిపోవడాన్ని పార్టీ నాయకులు తప్పుబడుతున్నారు. కొందరైతే.. మధ్యలోనే కార్యక్రమాన్ని వదిలేసి వెళ్లిపోయారు.విజయవాడ, విశాఖపట్నం వంటి కీలక నగరాల్లో ఒక్కరంటే ఒక్కరూ బయటకు రాలేదు. ధర్నాలు చేయలేదు. అంటే.. ఇప్పుడు వైసీపీలో నాయకులకు దిశానిర్దేశం చేయాల్సిన అధినేతే.. బెంగళూరుకు వెళ్లిపోతే.. తాము మాత్రం ఎందుకు రంగంలో ఉండాలన్న చర్చ అయితే.. తెరమీదికి వచ్చింది. ఇదేం పద్ధతి? అంటూ.. ప్రశ్నలు కూడా వస్తున్నాయి.

## బెయిలొచ్చేదాకా మోహన్‌బాబు దాక్కోవాల్సిందే..!



ఆంధ్ర ప్రగతి అమరావతి డిసెంబర్ 14:
మంచు మోహన్ బాబు ఆవేశం ఆయనను అజ్ఞాతంలోకి నెట్టేసింది. టీవీ చానల్ రిపోర్టర్ పై దాడికేసులో ముందస్తు బెయిల్ కోసం పెట్టుకున్న పిటిషన్ ను హైకోర్టు కొట్టివేయడంతో ఆయన పోలీసులకు అందుబాటులో లేకుండా పోయారు. ఆయన పోలీసులకు ఇవాళ అందుబాటులో ఉంటానని చెప్పారు. జల్ పల్లి నివాసానికి వచ్చి స్టేట్ మెంట్ నమోదు చేసుకోవచ్చని కూడా సమాచారం ఇచ్చారు. అయితే ముందస్తు బెయిల్ కొట్టి వేయడంతో అరెస్టు చేస్తారన్న ఉద్దేశంతో ఆయన అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు.మోహన్ బాబుపై తీవ్రమైన హత్యాయత్నం కేసు పెట్టారు. అందుకే అరెస్టు చేయడం ఖాయమన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. తొక్కిసలాట ఘటనలో ఏ 11గా ఉన్న అల్లు అర్జున్ నే అరెస్టు చేశారు. దాంతో ఏ వన్ గా ఉన్న తనను అరెస్టు చేయకుండా వదిలి పెట్టరని మోహన్ బాబు ఫీలయ్యారు. అందుకే ముందస్తు బెయిల్ కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించేవరకూ అయినా అజ్ఞాతంలో ఉండాలనుకుంటున్నారు.ఏం మట్లాడుకున్నారో కానీ కుటుంబ సమస్యపై అందరూ సైలెంట్ కావాలని నిర్ణయించుకున్నారు. కానీ ఈ ఘటనల్లో మోహన్ బాబు చేసిన దాడి తో మాత్రం ఆయన కేసుల పాలు కావాల్సి వచ్చింది. మొత్తంగా అసలు కంటే కొసరు కేసు మోహన్ బాబుకు సమస్యగా మారింది. జైలుకు తీసుకెళ్లే పరిస్థితి తెచ్చి పెట్టింది.

## హీరో అల్లు అర్జున్ ను ఫోన్ లో పరామర్శించిన సీఎం చంద్రబాబు

ఆంధ్ర ప్రగతి అమరావతి డిసెంబర్ 14:
హీరో అల్లు అర్జున్ ను ఏపీ సీఎం చంద్రబాబు ఫోన్ లో పరామర్శించారు. సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో అరెస్టై బెయిల్ పై విడుదలైన అల్లు అర్జున్ కు సీఎం చంద్రబాబు ఫోన్ చేశారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. నిన్న అల్లు అరవింద్ కు కూడా ఫోన్ చేసిన సీఎం చంద్రబాబు.. ధైర్యంగా ఉండాలని సూచించారు. హీరో బాలకృష్ణ, ఎన్టీఆర్, ప్రభాస్ కూడా ఫోన్ లో అల్లు అర్జున్ ను పరామర్శించారు. అరెస్టుపై విషయాలను అడిగి తెలుసుకున్నారు. బెయిల్ పై విడుదలైన అల్లు అర్జున్ ను టాలీవుడ్ హీరోలు, దర్శకులు, నిర్మాతలు వరుసగా పరామర్శిస్తున్నారు. హీరోలు రానా, నాగ చైతన్య అల్లు అర్జున్ ను పరామర్శించారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ అరెస్ట్‌పై డైరెక్టర్ రాంగోపాల్ వర్మ మరో ట్వీట్ చేశారు. హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ వద్ద పుష్ప 2 ప్రీమియర్ షో సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో ఒక మహిళ మృతి చెందగా.. ఈ కేసులో అల్లు అర్జున్‌ను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే.. శనివారం ఉదయం బెయిల్‌పై అల్లు అర్జున్ విడుదల అయ్యారు. దాంతో అల్లు అర్జున్ నివాసానికి ఉదయం నుంచి వరుసగా వెళ్తున్న టాలీవుడ్ హీరోలు, దర్శకులు, ప్రొడ్యూసర్లు.. తమ మద్దతు ప్రకటిస్తూ భరోసాగా నిలుస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆర్జీవీ మరో ట్వీట్ చేశారు. "భారత్‌లోనే అతి పెద్ద స్టార్.. తెలంగాణ నివాసి అయిన అల్లు అర్జున్ ఇండియన్ సినిమా హిస్టరీలోనే భారీ హిట్ కొట్టి తెలంగాణ రాష్ట్రానికి గిఫ్ట్‌గా ఇచ్చాడు. కానీ.. తెలంగాణ రాష్ట్రం అతడ్ని జైలుకి పంపించి అతి పెద్ద రిటర్న్ గిఫ్ట్ ఇచ్చింది" అని రాంగోపాల్ వర్మ ట్వీట్ చేశారు. ఈ ట్వీట్‌ను అల్లు అర్జున్ ఫ్యాన్స్ వైరల్ చేస్తున్నారు.

# జమిలి వచ్చినా మార్పుండదు

(మొదటి పేజీ తరువాయి)
భవిష్యత్ తరాల బాగు కోసం చేసే ప్రయత్నంలో అందరు భాగస్వామ్యం కావాలి. రేపటి తరం భవిష్యత్తు కోసమే విజన్ 2047. సాగునీటి సంఘాలు, సహకార, ఇతరత్రా ఎన్నికలు షెడ్యూల్ ప్రకారమే జరుగుతున్నాయి. ఈసారి కలెక్టర్ల సదస్సులో ఎన్నో మార్పులు తీసుకొస్తాం' అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. 'సుదీర్ఘ సమీక్షలకు తావివ్వకుండా ప్రశ్నలు, సమాధానాల రూపంలో నిర్వహిస్తాం. ముందుగానే కలెక్టర్లు, ఎస్పీలకు చర్చ అంశాలు పంపి సమాధానాలు కోరతాం. సమయం సద్వినియోగం, మంత్రులు, అధికారుల మధ్య సమన్వయం పెరుగుతుంది. ఆస్పత్రిలో చేరిన అద్వానీ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నా. అద్వానీ నాకు దశాబ్దాలుగా అనుబంధం ఉంది. ఆనాడు ఏపీ అభివృద్ధిలో అద్వానీ సహకారం మరువలేనిది' అని చంద్రబాబు గుర్తుచేశారు. రేపటి తరం భవిష్యత్తు కోసమే విజన్-2047 అని చెప్పుకొచ్చారు. స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్‌ను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. 1996 నాటి ఏపీ పరిస్థితులు.. 2020 నాటి పరిస్థితులు బేరీజు వేస్తే విప్లవాత్మక మార్పులు కనిపిస్తాయన్నారు. 2047లోనూ ఇదే పునరావృతం అవుతుందన్నారు సీఎం చంద్రబాబు. మరోవైపు సభ్యత్వం నమోదులో టీడీపీ న్యూ రికార్డ్ క్రియేట్ చేసింది. సభ్యత్వ నమోదుపై టీడీపీ ఆఫీసులో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. కార్యకర్తల సంఖ్య ప్రస్తుతం 73 లక్షలకు చేరుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఇక సభ్యత్వ నమోదులో టాప్ -5లో రాజంపేట్, నెల్లూరు, కుప్పం, పాలకొల్లు, మంగళగిరి నియోజకవర్గాలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. ఎప్పుడూ లేని విధంగా ఈసారి యువత, మహిళలు సభ్యత్వాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. పార్టీలో ఉన్నామంటే కుదరదని, పనితీరు ఆధారంగా గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీకి, ప్రజలకు సేవ చేయనివారికి పదవులు కావాలని కోరడం సరికాదన్నారు. పదవులు వచ్చాయని కొందరు పార్టీని నిర్లక్ష్యం చేస్తున్నారని, ప్రజలకు సేవ చేస్తేనే రాజకీయాల్లో కొనసాగుతారని చెప్పకనే చెప్పేశారు సీఎం చంద్రబాబు.

# జగన్ ఆస్తుల కేసులో విచారణ వాయిదా

(మొదటి పేజీ తరువాయి)
వైఎస్ జగన్మోహన్ రెడ్డి కేసుల విచారణలో జాప్యంపై అఫిడవిట్ రూపంలో నివేదికను సీబీఐ, ఈడీ దాఖలు చేశాయి. కేసుల జాప్యానికి గల కారణాలను అఫిడవిట్‌లో దర్యాప్తు సంస్థలు వివరించాయి. వైఎస్ జగన్మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసుల విచారణ ఆలస్యం అవుతోందని%ా% వేగవంతంగా ట్రయల్ పూర్తి చేసేందుకు తెలంగాణ నుంచి మరో రాష్ట్రానికి బదిలీ చేయాలని రాష్ట్ర అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు పిటిషన్ దాఖలు చేశారు. అలాగే ఆయన బెయిల్‌ను రద్దు చేయాలని.. లేకపోతే కేసుల విచారణపై తీవ్ర ప్రభావం పడుతుందని మరో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లను శుక్రవారం జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ పంకజ్ మిత్తల్ కూడిన ధర్మాసనం విచారించింది. సీబీఐ, ఈడీ తరపు న్యాయవాది అడిషనల్ సొలిసిటర్ జనరల్ (ఎఎస్‌జీ) రాజ్‌కుమార్ భాస్కర్ ఠాక్రే వాదనలు వినిపిస్తూ సీబీఐ, ఈడీ కేసుల స్టేటస్ వివరాలు గురువారం




సాయంత్రం ఫైల్ చేసినట్లు ధర్మాసనానికి తెలిపారు. దర్యాప్తు సంస్థలు దాఖలు చేసిన స్టేటస్ రిపోర్ట్ కాపీ తాము పరిశీలిస్తామని ధర్మాసనం తెలిపింది. తాము కూడా పరిశీలించడానికి కొంత సమయం కావాలని వైఎస్ జగన్మోహన్ రెడ్డి తరపు సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి కోరారు. వైఎస్ జగన్ కేసుల విచారణలో ఎందుకు జాప్యం జరుగుతుందని గతంలో దర్యాప్తు సంస్థలను సర్వోన్నత న్యాయస్థానం ప్రశ్నించింది. కేసుల స్టేటస్‌ను వివరిస్తూ నివేదిక ఇవ్వాలని ఈనెల 2 (సోమవారం)న విచారణ సందర్భంగా దర్యాప్తు సంస్థలను జస్టిస్ అభయ్ ఎస్ ఓకా ధర్మాసనం ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సుప్రీంకోర్టు ఆదేశాలతో జగన్ అక్రమాస్తుల వ్యవహారంలో సీబీఐ, ఈడీ కేసుల పురోగతిని, ప్రస్తుత పరిస్థితి, గతంలో తెలంగాణ హైకోర్టు ఆదేశాలు, ఆ తరువాత పరిణామాలతో అఫిడవిట్ రూపంలో స్టేటస్ రిపోర్టును దర్యాప్తు సంస్థలు దాఖలు చేశాయి. సిబిఐ, ఈడీ ఇచ్చిన నివేదికలను పరిశీలించిన తీర్పు ఇస్తామని తరువాత జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ పంకజ్ మిత్తల్ ధర్మాసనం స్పష్టం చేసింది. జగన్ అక్రమాస్తులు వ్యవహారంలో మొత్తం 125 పిటిషన్లపై విచారణ పెండింగ్‌లో ఉన్నాయి. ట్రైల్ కోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు దాఖలైన పిటిషన్లలో దాదాపు 80 శాతం పిటిషన్లు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈ విషయం జస్టిస్ అభయ్ ఎస్ ఓకా ధర్మాసనం ముందు దర్యాప్తు సంస్థలు దాఖలు చేసిన అఫిడవిట్‌లో వెల్లడి అయ్యాయి. శుక్రవారం జరిగిన విచారణలో రఘురామ కృష్ణరాజు తరపున న్యాయవాది బాలాజీ శ్రీనివాసన్ హాజరయ్యారు.

# మళ్లీ అరచేతిలో వైకుంఠం చూపిస్తున్న బాబు

ఆంధ్ర ప్రగతి అమరావతి డిసెంబర్ 14:
విజన్ 2047 పేరుతో చంద్రబాబు మళ్లీ అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారని.. ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ దశ - దిశ మారాలంటే తక్షణం కావాల్సింది విజన్లు కాదు.. విభజన హామీలు అని వ్యాఖ్యానించారు. రాష్ట్రాన్ని నెంబర్ 1గా నిలపాలంటే నెరవేరాల్సింది కేంద్రం ఇచ్చిన హామీలని స్పష్టం చేశారు. దశాబ్ద కాలంగా విభజన హామీలను గాలికి వదిలేశారు.. పూర్తిగా అటకెక్కించారని ఫైర్ అయ్యారు'రాష్ట్ర విభజన సమయంలో అనాడు యూపీఏ సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హెూదా హామీ ఇచ్చింది. పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హెూదా ఇచ్చింది. నూతన రాజధానికి పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం ఇవ్వాలని సూచించింది. బుందేల్ ఖండ్ తరహాలో వెనుక బడిన జిల్లాలకు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ప్రకటన చేసింది. మౌలిక సదుపాయాల కల్పన, పెద్ద ఎత్తున పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని షెడ్యూల్ 13 లో పొందపరించింది' అని షర్మిల వివరించారు. 'కడప స్టీల్, దుగ్గరాజుపట్నం పోర్టులను నిర్మిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం విభజన చట్టంలో పొందపరించింది. నూతన




రైల్వే జోన్, పెట్రోలియం యూనివర్సిటీ, విశాఖ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, విజయవాడ, విశాఖలో మెట్రో రైల్, హైదరాబాద్ నుంచి విజయవాడకు ర్యాపిడ్ రైల్, ఇలా ఎన్నో హామీలు నేటికీ కలగానే మిగిలాయి. ఇవ్వాల్టికి ఒక్క హామీకి దిక్కులేకుండా పోయింది' అని షర్మిల ట్వీట్ చేశారు. 'గడిచిన 10 ఏళ్లలో ప్రత్యేక హెూదా వచ్చి ఉంటే పన్నుల్లో రాయితీలు ఉండేవి. వేల సంఖ్యలో కొత్త పరిశ్రమలు వచ్చేవి. లక్షల్లో ఉపాధి అవకాశాలు లభించేవి. పోలవరం ప్రాజెక్టు పూర్తి అయ్యి ఉంటే రాష్ట్రం సస్యశ్యామలం అయ్యేది. విజయవాడ, విశాఖలో మెట్రో రైల్ నిర్మాణం జరిగితే ప్రధాన నగరాలుగా అభివృద్ధి చెందేవి. వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీలు అంది వుంటే పేదరిక నిర్మూలన సాధ్యం అయ్యేది. విభజన హామీలు అమలయ్యి ఉంటే రాష్ట్రం దిశ - దశ పూర్తిగా మారేది. దేశంలో నెంబర్ 1 రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ విరాజిల్లేది' అని షర్మిల వ్యాఖ్యానించారు. విభజన చట్ట హామీలు బుట్టదాఖలు చేయడంలో ప్రధాన ముద్దాయి ప్రధాని నరేంద్ర మోదీ అయితే, రెండో ముద్దాయి చంద్రబాబు, మూడో ముద్దాయి జగన్ మోహన్ రెడ్డి. ఈ ముగ్గురు కలిసి రాష్ట్రానికి తీరని ద్రోహం చేశారు. హెూదా 5 ఏళ్లు కాదు 10 ఏళ్లు ఇస్తామని మోదీ నమ్మబలికితే.. హెూదా ఏమైనా సంజీవనా అని చంద్రబాబు చెవుల్లో పూలు పెట్టారు' అని సెటైర్లు వేశారు. '25 మంది ఎంపీలు ఇస్తే ఎందుకు ఇవ్వరో చూస్తా అని శపథాలు చేసిన జగన్.. రాష్ట్ర ప్రజలకు తీరని అన్యాయం చేశారు. చంద్రబాబును కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది. ఎప్పటికైనా రాష్ట్ర అభివృద్ధికి సంజీవని ప్రత్యేక హెూదా మాత్రమే. హెూదాతోనే రాష్ట్రానికి విజన్. మోదీ పిలక మీ చేతుల్లో ఉంది. విభజన హామీలపై ప్రధానిని నిలదీయండి. కేంద్రం గల్లా పట్టి రాష్ట్ర హక్కులను సాధించండి' అని షర్మిల డిమాండ్ చేశారు.

# రాజ్యాంగ ఔన్నత్యాన్ని దెబ్బతీసేందుకు కాంగ్రెస్ ప్రయత్నించింది

ఆంధ్ర ప్రగతి న్యూఢిల్లీ డిసెంబర్ 14:
మన రాజ్యాంగ ఔన్నత్యాన్ని దెబ్బతీసేందుకు, రాజ్యాంగ నిర్మాతల కృషిని మట్టిపాలు చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నించిందని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. భిన్నత్వంలో ఏకత్వం అనే భావనను ఆ పార్టీ అర్థం చేసుకోలేదన్నారు. రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏళ్లు పూర్తైన సందర్భంగా లోక్ సభలో నిర్వహించిన ప్రత్యేక చర్చలో మోదీ మాట్లాడారు. మన రాజ్యాంగం ఎన్నో దేశాలకు స్ఫూర్తిగా నిలిచిందన్నారు.
రాజ్యాంగాన్ని ఖూనీ చేసేందుకు కాంగ్రెస్ ఎన్నో విధాలుగా ప్రయత్నించిందని విమర్శించారు. రాజ్యాంక శక్తి, ప్రజల ఆశీర్వాదం తమకు ఉన్నాయన్నారు. తమ పరిపాలనను చూసి ప్రజలు తమకు వరుసగా అవకాశాలు ఇస్తున్నారని తెలిపారు. ఎన్ని కష్టాలు వచ్చినా రాజ్యాంగ పరిరక్షణకు అండగా ఉంటామన్నారు. ఈ దేశాన్ని ఒక కుటుంబం 55 ఏళ్లు పాలించిందని, ఆ కుటుంబమే ఈ దేశానికి ఎన్నో విధాలుగా నష్టం చేసిందన్నారు. రాజ్యాంగ మార్పుపై రాష్ట్రాల సీఎంలకు నెహ్రూ లేఖ రాశారని పేర్కొన్నారు. ఆయన తప్పు చేస్తున్నాడని బాబూ రాజేంద్ర ప్రసాద్ చెప్పారని వెల్లడించారు.
కాంగ్రెస్ నేతలు రాజ్యాంగానికి 75 సార్లు సవరణలు చేశారని మోదీ అన్నారు. ఎమర్జెన్సీ విధించి ప్రజల హక్కులను కాలరాశారని ఆవేదన వ్యక్తం చేశారు.



వేలాది మందిని జైళ్లకు పంపించారని, కోర్టుల నోరు, పత్రికల గొంతు నొక్కేశారన్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల పదోన్నతిని కూడా అడ్డుకున్నారని విమర్శించారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం అనేక కుట్రలు చేశారని ధ్వజమెత్తారు. సోనియా గాంధీ కీలక నిర్ణయాలు తీసుకునేవారని మాజీ ప్రధాని మన్మోహన్ అన్నారని తెలిపారు. కాంగ్రెస్ పాలనకు ఈ వ్యాఖ్యలే నిదర్శనమన్నారు.

### అభివృద్ధిలో మహిళలది కీలక పాత్ర

మన దేశ అభివృద్ధిలో మహిళలది కీలక పాత్ర అన్నారు. మహిళలకు అన్ని రంగాల్లోనూ ప్రాధాన్యత దక్కాలన్నారు. మన రాజ్యాంగం మహిళలకు అన్ని విధాలుగా అండగా నిలిచిందని తెలిపారు. ఈ దేశాన్ని



వికసిత్ భారత్‌గా మార్చాలన్నారు. ప్రజల మధ్య ఐకమత్యం దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. భిన్నత్వంలో ఏకత్వమే మన దేశ గొప్ప విధానమని ప్రధాని అన్నారు. కొంతమంది స్వార్థపరుల వల్ల స్వాతంత్ర్యం వచ్చాక మనం అనేక కష్టాలు పడ్డామన్నారు.
బానిసత్వంలో ఉన్నవాళ్లు మన దేశ అభివృద్ధికి ఆటంకం కలిగించారని ఆరోపించారు. దేశ ఐక్యతను దెబ్బతీసేందుకు కొందరు విషబీజాలు నాటారని విమర్శించారు. పేదలు ఉపాధిని వెతుక్కుంటూ వివిధ ప్రాంతాలకు వెళ్తారని అందుకే వన్ నేషన్ వన్ రేషన్ కార్డు విధానాన్ని తీసుకొచ్చామన్నారు. మన రాజ్యాంగం అన్ని భాషలను గౌరవించిందన్నారు. రాష్ట్రాల మాతృభాషల అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. మాతృభాషలో చదివిన పిల్లల్లో సమగ్ర వికాసం ఏర్పడుతుందన్నారు.

# రాష్ట్రాల హక్కులు హరిస్తున్న కేంద్రం

ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 14:

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి రాష్ట్రాలకు ఇవ్వాల్సిన నిధుల వాటాను ఇవ్వకుండా కేంద్రం నుండి అందించాల్సిన సంక్షేమ పథకాల నిధులను కూడా ఇవ్వకుండా కోత విధించి దుర్మార్గమైన విధానాలను అనుసరిస్తుందని రాజ్యాంగానికి వ్యతిరేకంగా అనుకూలమైన ప్రభుత్వాలకు నిధులు ఇస్తూ వ్యతిరేక ప్రభుత్వాల పైన కక్ష సాధింపు చర్యలు చేయడం దుర్మార్గమని సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సిఐటియు కార్యాలయం నుండి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వరకు ప్లక్కార్డులు చేతపట్టుకుని అనంతరం జనరల్ ఆసుపత్రి వద్ద నిరసన కార్యక్రమం తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ నాగరాజు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ రాజశేఖర్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు నరసింహ నాయక్ వీరితో పాటు రైతు కార్మిక సంఘాల నాయకులు తోటమద్దులు, లక్ష్మణ్, వేన్న బాల వెంకటేష్, రామేశ్వరరావు, వెంకటేశ్వరరావు, సుబ్బరాయుడు లతోపాటు మరికొంతమంది పాల్గొనడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి అనుకూలమైన ప్రభుత్వాలకు నిధులను కేటాయిస్తూ వ్యతిరేక ప్రభుత్వాలను విస్మరిస్తూ రాష్ట్రాల హక్కుల




నారిస్తూ ప్రభుత్వాలను ఇబ్బందులకు గురి చేస్తూ ఆ రాష్ట్రాలలోని ప్రజల పైన కక్ష సాధింపు చర్యలు చేపట్టడం దుర్మార్గమని అక్షరాస్యతలో దేశంలోనే నెంబర్ వన్ గా నిలిచిన కేరళ సిపిఎం లెఫ్ట్ ప్రభుత్వం కు రావాల్సిన నిధులను విడుదల చేయడం లేదని ఆ రాష్ట్రానికి రావాల్సిన జీఎస్టీ నిధులను తిరిగి చెల్లించడం లేదని కేంద్రం నుంచి రావాల్సిన వాటాను కూడా ఇవ్వకుండా ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని దేశానికి ఆదర్శంగా నిలుస్తూ పరిపాలనలో మిగిలిన రాష్ట్రాల కంటే బేశుగ్గా అందిస్తున్న రాష్ట్రం పైన కుట్రపూరితంగా విషం కమ్ముతోందని ఇది రాజ్యాంగ ఉల్లంగనేనని ఇప్పటికైనా కేరళ రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వాల్సిన వాటాను ఇవ్వాలని అదేవిధంగా మిగిలిన రాష్ట్రాల హక్కులను హరించకుండా కేంద్రం అన్ని రాష్ట్రాల పైన పెత్తనం తగ్గించుకోవాలని వ్యతిరేకమైన ప్రభుత్వాలపైన ఇబ్బందుల గురిచేసి అక్కడ ఉన్న రాజకీయ పార్టీల పైన నాయకుల పైన సిబిఐ ఈడి లాంటి వాటిని ఉపయోగించి తన వైపు తిప్పుకోవడం దుర్మార్గమని ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలని లేకుంటే అన్ని రాష్ట్రాలలోని ప్రజలు రాబోయే కాలంలో బిజెపి ప్రభుత్వాన్ని కూకటి వేళ్లతో పెగల్చివేస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి వెంకట లింగం జైలాన్ రత్తమయ్య రామయ్య కరిముల్లా సురేషు మద్దిలేటి రామకృష్ణ తదితరులు పాల్గొనడం జరిగింది.

## నీటి సంఘం అధ్యక్షులుగా సంగిరెడ్డి నాగేశ్వరరెడ్డి ఉపాధ్యక్షులుగా లక్క ఆనందరావు.



ఆంధ్ర ప్రగతి శిరివెళ్ల డిసెంబర్ 14: మండల పరిధిలోని గోవిందపల్లి గ్రామంలో జరిగినటువంటి నీటి సంఘం ఎన్నికల్లో సంగిరెడ్డి నాగేశ్వర్రెడ్డి ప్రెసిడెంట్ గా ఎన్నిక అయినట్లు డిప్యూటీ తాసిల్దార్ కిరణ్ కుమార్ పేర్కొన్నారు. అలాగే వైస్ ప్రెసిడెంట్ గా లక్క ఆనందరావు ఎన్నికైనట్లు పేర్కొన్నారు.కేసీ కెనాల్ డబ్ల్యు యు ఏ 28 నెంబర్ పరిధిలోని నీటి వినియోగదారుల అసోసియేషన్ అధ్యక్షులుగా సంగిరెడ్డి నాగేశ్వర్రెడ్డి ఎన్నిక కావడం పట్ల గోవిందపల్లి కామినేని పల్లె శిరివెళ్ల కోటపాడు వీరారెడ్డి పల్లె తదితర గ్రామాల ప్రజలు రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూలమాలలతో ఘనంగా సన్మానం చేశారు. కామినేని పల్లె గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ శిరిగిరి రాంభూపాల్ రెడ్డి,మాజి ఉప సర్పంచ్ బ్రదర్ లక్క అనిల్ కుమార్, డీలర్ చలమయ్య ఇతర నాయకులు ప్రముఖులు, రైతులు నీటి సంఘం ప్రెసిడెంట్ గా ఎన్నికైన నాగేశ్వర్ రెడ్డి గారిని లక్క ఆనందరావును ఘనంగా సన్మానం చేశారు. ఎన్నికైన ప్రెసిడెంట్ నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ అవకాశం కల్పించిన రైతన్నలకు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలకు ఎంఎల్ఏ భూమ అఖిల ప్రియ గారికి భార్గవ్ రామ్ గారికి భూమ జగత్ విద్యా రెడ్డి గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## మహానంది మండలంలో తొమ్మిది నీటి సంఘాలు ఏకగ్రీవం



ఆంధ్ర ప్రగతి మహానంది డిసెంబర్ 14: మహానంది మండలంలోని 9 నీటి సంఘాలకు జరిగిన ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. చెరువులకు సంబంధించి గోపవరం భైరవాణి చెరువుకు కశెట్టి శ్రీనివాసులు ఉప చైర్మన్ గంగసాని వెంకట్ రెడ్డి, బసాపురం చెరువు చైర్మన్ మంటినూనె అమీర్ భాష, ఉప చైర్మన్ గా తోట వెంకటసుబ్బయ్య, అంకిరెడ్డి చెరువు చైర్మన్ నల్లోల సర్వ పుల్లయ్య ఉప చైర్మన్ భాస్కర్ రెడ్డి, తమడ పల్లె ఇంజవాని చెరువు మల్కి రెడ్డి మహేశ్వర్ రెడ్డి ఉప చైర్మన్ గా దేవరశెట్టి సుబ్బయ్య ఎన్నిక కాగా తెలుగు గంగా తొమ్మిదో బ్లాక్ సంబంధించి చైర్మన్ గా గుద్దేటి నాగరాజు, ఉప చైర్మన్గా దూదేకుల శివ మౌలాలి, 10వ బ్లాక్ చైర్మన్ కొండ పోయిన వెంకటేశ్వర్లు ఉప చైర్మన్ నీళ్ల రామకృష్ణ 15 హరిప్రసాద్ రెడ్డి 18 చింతల క్రాంతి కుమార్, ఉప చైర్మన్ గా నంద్యాల వీరశేఖర్ 19 సి అశోక్ కుమార్ రెడ్డి ఉప చైర్మన్ డి మహేశ్వర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మండల తహసిల్దార్ రమాదేవి, , మండల ఏఈఓ నాగేశ్వర్ రెడ్డి ఆర్ ఐ సుబ్బారావు తెలిపారు.

## ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



ఆంధ్ర ప్రగతి డోన్ డిసెంబర్ 14:
స్ఫూర్తి సేవా సమితి ఆధ్వర్యంలో యూ.కొత్తపల్లి గ్రామంలో శనివారం నాడు కర్నూలు శాంతిరామ్ ఐ హాస్పిటల్ వారిచే ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి కొత్తపల్లి, ఉంగరాణిగుండ్ల, సీసంగుంతల, మల్యాల గ్రామ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ శిబిరానికి డోన్ డియస్పీ శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరై శిబిరాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాలలో మెడికల్ క్యాంపులు నిర్వహించి పల్లె ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న స్ఫూర్తి సేవా సమితి వారిని డియస్పీ అభినందించారు. ఈ శిబిరం ద్వారా శుక్లం ఆపరేషన్ కి ఎంపికైన వారిని కర్నూలు శాంతిరామ్ హాస్పిటల్ కి తీసుకెళ్లి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తామని స్ఫూర్తి సంస్థ అధ్యక్షుడు స్ఫూర్తి మధు అన్నారు. అనంతరం డియస్పీ ని శాలువా పూల మాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్ఫూర్తి సభ్యులు స్ఫూర్తి మధ్య, మోహన్ రెడ్డి, కొత్తపల్లి శ్రీను, హుసేన్, హెూటల్ శివ, శాంతిరామ్ హాస్పిటల్ సిబ్బంది, కొత్తపల్లి టీడీపీ నాయకులు మిన్నల్లా, రసూల్, ఉంగరాణిగుండ్ల చిన్న మద్ది, సీసంగుంతల రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నంద్యాల నియోజకవర్గంలో సాగునీటి స్థానాలు టీడీపీకి ఏకగ్రీవం

**-ఏకగ్రీవమైన సభ్యులను అభినందించిన మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్**





ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 14: నంద్యాల నియోజకవర్గంలో జరిగిన సాగునీటి సంఘం ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మద్దతుదారులు టీడీపీకి ఏకగ్రీవం అయ్యాయి. ఏకగ్రీవమైన అధ్యక్షులతో పాటు ఉపాధ్యక్షులను డైరెక్టర్లను , టీసీలు ను టిడిపి కార్యాలయం (రాజ్ టాకీస్) నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అభినందించి వారికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. అలాగే గెలుపొందిన అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, టిసీలు మంత్రి ఎన్ఎండి ఫరూక్, ఎన్ఎండి ఫిరోజ్ , ఎన్ఎండి ఫయాజ్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## నీటి సంఘం అధ్యక్షులుగా కమతం లక్ష్మిరెడ్డి

### ఉపాధ్యక్షులుగా కోటపాడు బుసిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నిక.



ఆంధ్ర ప్రగతి సిరివెళ్ల, డిసెంబర్14:మండల పరిధిలోని ఎర్రగుంట్ల గ్రామంలో నీటి సంఘం ఎన్నికల్లో ప్రెసిడెంట్ గా కమతం లక్ష్మిరెడ్డి, ఉపాధ్యక్షులుగా కోటపాడు బూసి రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎలక్షన్ ఆఫీసర్ పేర్కొన్నారు..కేసీ కెనాల్ డబ్ల్యు యు ఏ 29 నెంబర్ పరిధిలోని నీటి వినియోగదారుల కమతం లక్ష్మిరెడ్డి ఉపాధ్యక్షులుగా కోటపాడు భూసిరెడ్డి ఎన్నిక కావడం పట్ల ఎర్రగుంట్ల కోటపాడు తదితర గ్రామాల ప్రజలు రైతులు పెద్ద ఎత్తున తరలి వచ్చి పూలమాలలతో ఘనంగా సన్మానం చేశారు. అనంతరం సిరివెళ్ల కు చెందిన అభిమానులు ఉల్లి వెంకట సుబ్బయ్య, కొత్తపేట జ క్రియ , అభిమానులు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూల మాలలతో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నికైన కమతం లక్ష్మిరెడ్డి కోటపాడు బుసిరెడ్డి

మాట్లాడుతూ ఈ అవకాశం కల్పించిన రైతన్నలకు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలకు ఎంఎల్ఏ భూమ అఖిల ప్రియ, భార్గవ్ రామ్, భూమ జగత్ విఖ్యాత రెడ్డి ల కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## తెలుగు గంగకు విడతల వారీగా నీటి విడుదల



ఆంధ్ర ప్రగతి మహానంది డిసెంబర్ 14: తెలుగు ప్రధాన కాలువకు విడతల వారీగా సాగునీటిని విడుదల చేయనున్నట్లు విశ్వాసనీయ సమాచారం. రైతులు రబీ సీజన్లో వేసే పంటలను కాపాడుకొనేందుకు భాగంగా నీటిని విడుదల చేయనున్నట్లు తెలుస్తుంది. 3 4 రోజుల్లో వెలుగోడు రిజర్వాయర్ నుండి తెలుగు ప్రధాన కాలువ ద్వారా నీటి విడుదల చేయనున్నారని సమాచారం. ఇటీవల జరిగిన కర్నూలు ఉమ్మడి జిల్లా ఐడిబిఐ సమావేశంలో తెలుగు గంగ ప్రధాన కాలువకు నీటి విడుదలపై జరిగిన సమావేశంలో నీటి విడుదలపై చర్చ జరిగిన వాటి వివరాలు పూర్తిగా బయటికి వెల్లడించలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఖరీఫ్ సీజన్లో వేసిన వరి పంట అకాల వర్షాలు పెనుగాలుల వల్ల నేల వాలి తీవ్రంగా నష్టపోవడంతో పాటు పంట కోత కోసే సమయంలో అకాల వర్షాలు తుఫాన్ ల వల్ల దెబ్బ తినడంతో పాటు ధరలు అమాంతం పడిపోవడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం రబీ సీజన్లో వేసే పంటకైన పూర్తిస్థాయిలో తెలుగు గంగ ప్రధాన కాలువ కింద నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని ప్రజా ప్రతినిధులను మరియు అధికారులను కోరుతున్నారు. తెలుగు ప్రధాన కాలువలో గత కొంతకాలం నుంచి మిగిలిపోయిన, నిలిచిపోయిన లైనింగ్ పనులను చేపట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. రైతుల పంటలకు రబీ సీజన్లో సాగునీరు అందిస్తారా లేక కొన్ని రోజులపాటు మాత్రమే సాగు నీటిని విడుదల చేసి మరమ్మతులు లేదా లైనింగ్ పనులను చేపడుతారా అనేది ప్రశ్నార్థకంగా మారినట్లు తెలుస్తుంది. ఏది ఏమైనా అధికారులు కానీ ప్రజాప్రతినిధులు కానీ తెలుగు గంగ కాలువకు సాగు నీటి విడుదలపై ఎప్పుడూ, ఎంతవరకు అనేది స్పష్టమైన ప్రకటన విడుదల చేయాల్సి ఉంది.

## ఎన్టీఆర్ వజ్రోత్సవ వేడుకలో సినీ పాత్రికేయులకు విశిష్ట సత్కారం



ఆంధ్ర ప్రగతి గుడివాడ డిసెంబర్ 14:
కృష్ణా జిల్లా పోరంకిలో నిర్వహించిన ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ కార్యక్రమంలో సీనియర్ సినీ పాత్రికేయులను ఘనంగా సన్మానించారు. ఎన్టీఆర్ డైమండ్ జూబ్లీ పేరిట ప్రత్యేకంగా తయారుచేయించిన జ్ఞాపికలను ముఖ్యమంత్రి చంద్రబాబు సీనియర్ సినీ జర్నలిస్టులకు బహూకరించారు. మోహన్ గోటేటి, బీకే ఈశ్వర్, కె.ఉదయవర్లు, కె.ఉమామహేశ్వరరావు, గౌస్, శాతవాహన, యు.వినాయకరావు, రెంటాల జయదేవ, అనురాధ, రమణమూర్తి తదితర పాత్రికేయులు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా మెమెంటోలు అందుకున్నారు.
కాగా, ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న సీఎం చంద్రబాబు, భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ స్పెషల్ క్యాలెండర్ ను కూడా ఆవిష్కరించారు. దాంతోపాటే, తారకరామం-అన్న గారి అంతరంగం పుస్తకాన్ని కూడా ఆవిష్కరించారు. ఈ పుస్తకంలో ఎన్టీఆర్ సినిమా కెరీర్ విశేషాలు, పలు ఇంటర్వ్యూలో ఆయన చెప్పిన మాటలు, ఆయన గురించి సమాచారాన్ని, ఆయన గురించి ఇతర ప్రముఖులు చెప్పిన మాటలను పొందుపరిచారు.

# కూటమి సర్కార్ కు పింఛన్లు ఎఫెక్ట్ పడుతోందా..?



ఆంధ్ర ప్రగతి అమరావతి డిసెంబర్ 14:
ఏపీలో సామాజిక భద్రత కింద ప్రభుత్వం అమలు చేస్తున్న పింఛన్ల పథకం.. ఇప్పుడు తీవ్ర స్థాయిలో చర్చకు దారితీస్తోంది. గత వారం పది రోజులుగా ఎక్కడ చూసినా పింఛన్ల పథకంపైనే ఎక్కువగా చర్చ నడుస్తోంది. తమ పింఛన్ తీసేస్తారేమో.. అనే బెంగతో చాలా మంది లబ్ధిదారులు ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. తెలిసిన వారిని అడుగుతున్నారు. దీనికి కారణం.. ప్రభుత్వం నుంచి పింఛన్ల ను తగ్గించాలన్న స్పష్టమైన ఆదేశాలు రావడమే. ఇప్పటికే రెండు రోజులు 9, 10 తేదీల్లో సర్వే చేయాలని సర్కారు ఆదేశించింది.అయితే.. దీనిని కలెక్టర్ల సదస్సు నేపథ్యంలో వాయిదా వేశారు. కానీ, ఇప్పుడు పూర్తిస్థాయి పగ్గాలను కలెక్ట ర్లకే అప్పగించారు. అర్హులు కాని వారికి పింఛన్లు ఆపేయాలని.. ముఖ్యంగా దివ్యాంగుల పింఛన్లను తగ్గిం చాలని సీఎం చంద్రబాబు స్వయంగా చెప్పారు. ఇదే ఇప్పుడు పెద్ద వివాదంగా మారింది. ఎవరైనా పెంచి నప్పుడు ఆనందిస్తారు. కానీ, వస్తున్న సొమ్మును తీసేస్తే.. మాత్రం వ్యతిరేకిస్తారు. పైగా ఇప్పటి వరకు దివ్యాంగుల పింఛన్ విషయంలో ఎన్నడూలేని విధంగా సర్కారు వ్యవహరించడం కూడా.. చర్చకు దారితీసింది.అయితే.. ప్రభుత్వానికి అనుమానాలు.. అనర్హులు కూడా లబ్ధి పొందుతున్నారన్న సందేహాలు ఉంటే.. అలాంటి వారిని గుర్తించడం వరకు తప్పులేదు. పైగా.. వీరంతా ఈ ఆరు మాసాల్లో లబ్ధి పొందిన వారు కాదు. వైసీపీ హయాం నుంచి రూ.3000 చొప్పున తీసుకుంటున్నవారే. పోనీ.. వీరిలోనూ అనర్హులు ఉన్నారని అనుకుంటే.. వారిని గుర్తించి.. పింఛన్ మొత్తాన్ని తగ్గిస్తే సరిపోతుంది.. తప్పు.. అసలు తీసేస్తే.. అది సర్కారుపై వ్యతిరేకతను.. సీఎం చంద్రబాబపై అపనమ్మకాన్ని పెంచుతుంది. సునిశితమైన ఈ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి.
ఇక, అనాథలకు పింఛను ఇస్తామని చంద్రబాబు చెబుతున్నారు. ఇవి వినూత్న ఆలోచనగా చెప్పుకొచ్చారు. కొత్తగా వీరిని పింఛన్ల జాబితాలో చేర్చాలని కూడా చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా లెక్కల ప్రకారం.. లక్ష మందికిపైనే అనాథలు ఉన్నారు. వీరిని లబ్ధిదారులుగా చేర్చడం తప్పులేక పోవచ్చు.. కానీ, ఉన్న వారిని తొలగించడమే ప్రభుత్వానికి ఇబ్బందులు కోరి తెచ్చుకున్నట్టు అవుతుంది. ఇప్పటికీ ఆరు మాసాల పాలనలో నిత్యావసర ధరలుఏమీ తగ్గలేదు. పైగా విద్యుత్ చార్జీల మోత మోగుతూనే ఉంది. ఈ పాపాలను జగన్పైకితోసేసినా.. ఇప్పుడు పింఛన్లను తొలగిస్తే.. ఆ పాపం కూడా జగన్దే అంటే.. ప్రజలు నమ్ముతారా.?

## 22న సపోజ్ గ్రాండ్ క్రిస్మస్ సెలబ్రేషన్ వేడుకలు

**-పోస్టర్ను ఆవిష్కరించిన టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్.**



ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 14:
క్రిస్మస్ పండుగ సందర్భంగా ఈ నెల 22వ తేదీన సపోజ్ గ్రాండ్ క్రిస్మస్ సెలబ్రేషన్ వేడుకలు నిర్వహించడం జరుగుతుందని, ఈ పోస్టర్ ను టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ఆవిష్కరించారు. నంద్యాల పట్టణం నందమూరినగర్ పాస్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇండియన్ జిప్సీ మినిస్ట్రీస్ వారి నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా న్యాయ, మైనారిటీ సంక్షేమశాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ లు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో 38వ వార్డు టిడిపి ఇన్చార్జి తాటికొండ బుగ్గ రాముడు, తాటికొండ మహేష్, పాస్టర్లు పాల్గొన్నారు. అదే రోజున 500 మంది పేద మహిళలకు చీరలను, వందమంది పాస్టర్లకు దుస్తులను పంపిణీ చేయునునట్లు తాటికొండ బుగ్గ రాముడు తెలిపారు.

# ఎర్ర మట్టి అక్రమ రవాణా..!

**-తెలుగు గంగ కలువ కోతకు గురయ్యే అవకాశం ఉంది.**

**-అతి వేగంగా..ప్రమాద అంచుల్లో వాహనదారులు.**

**-స్పందించని సంబంధిత అధికారులు.?**



ఆంధ్ర ప్రగతి మహానంది డిసెంబర్ 14 నంద్యాల జిల్లా, మహానంది మండలం గాజులపల్లె మీదుగా అక్రమంగా ఎర్రమట్టి తరలించడం చర్చనీయంగా మారింది. తెలుగు గంగ కాలువ మీదుగా అధిక లోడుతో టిప్పర్లు రావడంతో, కట్ట కోతకు గురయ్యే ప్రమాదం ఉందని రైతులు చర్చించుకుంటున్నారు. ఇంత జరుగుతున్న అధికారులు చూసి చూడనట్టు ఉండడం పలు విమర్శలకు తావితీస్తోంది. టిప్పర్లు గాజులపల్లి మీదుగా అతివేగంగా ఎర్ర మట్టి తరలించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

## ఫోన్ పే, గూగుల్ పే వాడుతున్నారా.?

# జనవరి 1 నుంచి రూల్స్ ఛేంజ్..!

ఆంధ్ర ప్రగతి అమరావతి డిసెంబర్ 14:
2025లో యూపీఐ లావాదేవీలకు సంబంధించి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ముఖ్యమైన నోటిఫికేషన్ ను విడుదల చేసింది. కొత్త ఆర్బీఐ ద్రవ్య విధానం 2025 జనవరి నుంచి అమల్లోకి రానుంది. యూపీఐ సేవను ఉపయోగించే పబ్లిక్.. ఈ నియమాలను తెలుసుకోవడం అత్యవసరం అనే చెప్పాలి. యూపీఐ లావాదేవీలకు సంబంధించి రిజర్వ్ బ్యాంక్ జారీ చేసిన కొత్త నియమాలు, వాటి ద్వారా జరిగే మార్పులను వివరంగా చూద్దాం..

**యూపీఐ చెల్లింపులలో రాబోయే మార్పులు**

భారతీయ రిజర్వ్ బ్యాంక్ ప్రకటించిన కొత్త నిబంధనలు డిజిటల్ మనీ లావాదేవీలపై ప్రత్యక్ష ప్రభావం, మార్పును చూపుతాయి. ముందుగా యూపీఐ లావాదేవీ పరిమితుల్లో కొన్ని మార్పులు చోటు చేసుకోనున్నాయి. అంటే జనవరి 1 నుండి యూపీఐ 123 చెల్లింపు లావాదేవీల్లో పరిమితిని పెంచారు. గతంలో యూపీఐ చెల్లింపు పరిమితి కేవలం రూ.5,000 కాగా, ఇప్పుడు దానిని రూ.10,000కి పెంచారు. రిజర్వ్ బ్యాంక్ ఈ కొత్త నిబంధనను ప్రకటించినప్పటికీ.. బ్యాంకులు, సర్వీస్ ప్రొవైడర్లు ఈ నిబంధనలను పాటించడానికి, వినియోగదారులకు సేవలను అందించడానికి సమయం ఇచ్చారు. ఈ వ్యవధి డిసెంబర్ 31తో ముగుస్తుంది. ఈ నేపథ్యంలో జనవరి 1 నుంచి ఈ కొత్త నిబంధనలను అమలు చేయాలని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ నిర్ణయించింది. అలాగే, జనవరి 1 నుండి కొత్త యూపీఐ చెల్లింపులు చెల్లింపు లావాదేవీ పరిమితిని అనుసరించాలని బ్యాంకులకు సూచించింది.




**ఏ ఇతర నియమాలు అమలులో ఉన్నాయి?**

జనవరి 1 నుండి యూపీఐ డబ్బు లావాదేవీ పరిమితులు మాత్రమే కాకుండా.. కొన్ని కొత్త నిబంధనలు కూడా అమలులోకి వస్తాయి. దీని ప్రకారం, యూపీఐ 123 పే ద్వారా చేసే లావాదేవీలకు ఎటువంటి సేవా రుసుమును విధించరు. అంతే కాకుండా ఇంటర్నెట్ సర్వీస్ లేకుండా రెమిటెన్స్ సర్వీస్ కూడా ఉంటుంది. అంటే ఫీచర్ ఫోన్ల ద్వారా ఐవీఆర్ అంటే ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ నెంబర్ను ఉపయోగించి డబ్బు లావాదేవీలు చేయవచ్చు. సో.. మీ ఫోన్ కు ఇంటర్నెట్ ఉండాల్సిన అవసరమే లేదు.
అదే విధంగా జనవరి 1 నుంచి మరో కొత్త నిబంధన అమల్లోకి రానుంది. పాన్ కార్డుతో ఆధార్ కార్డును లింక్ చేయడం తప్పనిసరి. పాన్ కార్డ్తో ఆధార్ కార్డ్ లింక్ చేయకపోతే పాన్ కార్డ్ డిజేబుల్ అవుతుంది. ఒకవేళ పాన్ కార్డ్ డిజేబుల్ అయితే, ఆర్థిక లావాదేవీలకు సంబంధించి ఎలాంటి సేవలను నిర్వహించడం సాధ్యం కాదు. సో.. ఈ రెండు అంశాలను జాగ్రత్తగా గుర్తుపెట్టుకోండి.

# సభ్యత్వ నమోదులో టీడీపీ సరికొత్త రికార్డు..!

ఆంధ్ర ప్రగతి అమరావతి డిసెంబర్ 14:
సభ్యత్వ నమోదులో తెలుగుదేశం పార్టీ సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. అక్టోబర్ 26న సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం కాగా.... నేటికి 73 లక్షలకు చేరింది. సభ్యత్వాల నమోదుపై పార్టీ కేంద్ర కార్యాలయంలో నేతలతో సిఎం చంద్రబాబు నాయుడు సమీక్ష చేశారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నేతృత్వంలో సభ్యత్వ కార్యక్రమం జరుగుతోంది. సభ్యత్వ నమోదు అంశాలను ఆ విభాగ ప్రతినిధులు చంద్రబాబుకు వివరించారు. నేటికి దాదాపు 73 లక్షల మంది సభ్యత్వం తీసుకోగా..ఇందులో 85 వేల మంది తెలంగాణ రాష్ట్రం నుంచి పొందారు. ఇప్పటి వరకు జరిగిన నమోదులో 54 శాతం మంది కొత్త వారు సభ్యత్వం తీసుకున్నారు. సభ్యత్వ నమోదులో 1.18 లక్షలతో రాజంపేట మొదటి స్థానంలో ఉండగా, నెల్లూరు సిటీలో 1.06 లక్షలు, కుప్పంలో 1.04 లక్షలు, పాలకొల్లులో 1.02 లక్షలు, మంగళగిరిలో 90 వేల సభ్యత్వాలు నమోదయ్యాయి. సభ్యత్వ కార్యక్రమంపై చంద్రబాబు సంతృప్తి వ్యక్తం చేశారు. సభ్యత్వ కార్యక్రమంతో పార్టీ బలమైన కార్యకర్తల ఆర్మీని తయారు చేస్తామని సీఎం అన్నారు. ప్రతి నలుగురిలో ఒకరు తెలుగుదేశం సభ్యత్వం పొందే పరిస్థితి రావాలని చంద్రబాబు అన్నారు. తెలుగుదేశం కార్యకర్తలకు సంక్షేమం అందించడంతో పాటు రాజకీయంగా, ఆర్థికంగా ఎంపవర్ చేసే కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో అమలు చేస్తామన్నారు. స్కిల్ డవలెప్మెంట్, అవకాశాలు కల్పించడం, ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలకు ప్రాధాన్యత క్రమంలో అందించడం ద్వారా ఆర్థికంగా వాళ్లు నిలదొక్కుకునే కార్యక్రమాలు చేపట్టాల్సి ఉందని సిఎం అన్నారు. కేవలం వెల్ఫేర్ మాత్రమే కాకుండా కార్యకర్తల తలసరి ఆదాయం పెంపుకు చర్యలు తీసుకుంటామని చంద్రబాబు అన్నారు. దీనిపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సిఎం తెలిపారు. కష్టపడి పని చేసిన వారికి మెరిట్ పద్ధతిలో పదవులు ఇవ్వడంతో పాటు...ఆయా కుటుంబాలను ఆర్థికంగా నిలబెట్టే కార్యక్రమం పార్టీలో అన్ని స్థాయిలో జరుగుతుందన్నారు. అనంతరం పార్టీకి చెందిన ఇతర విభాగాల పని తీరుపైనా చంద్రబాబు సమీక్షించారు.

**ముగ్గురు మంత్రులకు పెండింగ్ బిల్లుల సమస్య పరిష్కార బాధ్యత**

గత వైసీపీ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపులో భాగంగా నీరు చెట్టు, నరేగా బిల్లులను నిలిపివేసిందని, ఇప్పటికే కొంత మేర బిల్లులు ఇచ్చామని....మిగిలిన మొత్తం కూడా త్వరలో చెల్లిస్తామని సిఎం చెప్పారు. నాడు పనులు చేసి బిల్లులు రాక ఇబ్బంది పడుతున్నవారి సమస్యల పరిష్కారాన్ని ముగ్గురు మంత్రులకు అప్పగిస్తూ చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు ఈ అంశంపై ఎప్పటికప్పుడు చర్చించి....ప్రభుత్వం నుంచి నిబంధల ప్రకారం బిల్లులు మంజూరు అయ్యేలా చూసే బాధ్యతను అప్పగించారు.

# మనకు తెలిసిన, మనం చూసిన ఏకైక యుగపురుషుడు ఎన్టీఆర్

**: సీఎం చంద్రబాబు**

**ఎన్టీఆర్ తొలి చిత్రం మనదేశం**

**ఆ చిత్రం విడుదలై 75 ఏళ్లు**

**పోరంకిలో ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుక**

**ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించిన సీఎం చంద్రబాబు**





ఆంధ్ర ప్రగతి గుడివాడ డిసెంబర్ 14:
జగద్విఖ్యాత మహా నటుడు ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నందమూరి తారకరామారావు తొలి చిత్రం మనదేశం విడుదలై 75 ఏళ్లయిన సందర్భంగా ఈ వేడుక జరుపుకుంటున్నామని చంద్రబాబు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి మనదేశం చిత్ర నిర్మాత కృష్ణవేణి గారు కూడా హాజరవడం విశేషమని అన్నారు. ఆమెకు ఇప్పుడు 102 సంవత్సరాలని, ఆమె పట్టుదలను మెచ్చుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎంతో పట్టుదలతో రావడమే కాకుండా, ఎలాంటి డిస్ట్రబెన్స్ లేకుండా ప్రశాంతంగా కూర్చున్నారని వివరించారు. అందుకు కారణం ఆమె జీవితంలో క్రమశిక్షణ అని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమానికి సినీ ప్రముఖులు రావడం హర్షణీయమని చంద్రబాబు వ్యాఖ్యానించారు. దగ్గుబాటి సురేశ్, మాజీ ఎంపీ జయప్రద, ప్రభ, కృష్ణంరాజు అర్ధాంగి శ్యామల, ఘట్టమనేని ఆదిశేషగిరిరావు, కేఎస్ రామారావు హాజరయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఎంతో సమర్థంగా నిర్వహిస్తున్నందుకు టీడీ జనార్ధన్ ను అభినందిస్తున్నానని తెలిపారు. ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ లేకపోతే ఈ కార్యక్రమం లేదని అన్నారు.
ఎన్టీఆర్ కు భారతరత్న సాధిస్తామని, ఎన్టీఆర్ కు భారతరత్న ఇవ్వడం అంటే తెలుగుజాతిని గౌరవించడమేనని స్పష్టం చేశారు.ఇవాళ మనం ఎన్టీఆర్ వజ్రోత్సవ వేడుక జరుపుకుంటున్నాం. ఇదొక అపూర్వ ఘట్టం. గతేడాది ఎన్టీఆర్ శతజయంతి వేడుకలు జరుపుకున్నాం. సంవత్సరమంతా ఉత్సవాలు జరుపుకున్నాం. ఒక యుగపురుషుడు జన్మించినప్పుడు చరిత్ర అతడిని మర్చిపోదు. అందుకు ఎన్టీఆర్ ఒక ఉదాహరణ. ఒక దేశంలో అని కాదు... ప్రపంచంలోని అనేక దేశాల్లో ఆయన శతజయంతి వేడుకలు జరుపుకున్నాం. మరోసారి ఆయన పేరిట సినీ వజ్రోత్సవ వేడుక ఏర్పాటు చేసుకోవడం, మళ్లీ మనందరం ఆయన గురించి మాట్లాడుకోవడం సంతోషదాయకం. ఎన్టీఆర్ వంటి యుగపురుషులు అరుదుగా పుడతారు. మనకు తెలిసిన, మనం చూసిన ఏకైక యుగపురుషుడు ఎన్టీఆర్. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా, తెలుగుజాతి పేరు వింటేనే గుర్తుకు వచ్చే వ్యక్తి ఎన్టీఆర్. చరిత్ర ఉన్నంత వరకు తెలుగువారి హృదయాల్లో ఉండే వ్యక్తి ఎన్టీఆర్. అచ్చమైన తెలుగుదనం, తెలుగువాడి ఆత్మగౌరవం... ఈ రెండింటికి అర్థం ఎన్టీఆర్.
ఒక చిన్న రైతు కుటుంబంలో పుట్టి, తెలుగు సినీ చరిత్రలో ఒక ఎవరెస్ట్ లా ఎదగడం, తొమ్మిది నెలల్లోనే పార్టీ పెట్టి ముఖ్యమంత్రి కావడం చరిత్రలో ఎక్కడా జరగలేదు... భవిష్యత్తులోనూ జరుగుతుందన్న నమ్మకం లేదు... జరగదు. ఇటు వెండితెరను, అటు రాజకీయాలను ఏలిన ఏకైక నాయకుడు భారతదేశ చరిత్రలో ఎన్టీఆర్ ఒక్కరే. రంగం ఏదైనా ఆయన అడుగుపెట్టిన ప్రతి చోటా సువర్ణ అధ్యాయాన్ని లిఖించారు.
ఎన్టీఆర్ నటించిన తొలి చిత్రం మనదేశం... విడుదలై 75 సంవత్సరాలవుతోంది. ఇవాళ ఆయన లేకపోయినా మనం ఈ వేడుక జరుపుకుంటున్నామంటే అదీ ఎన్టీఆర్ గొప్పదనం. ఒక్కోసారి యుగపురుషుల చరిత్ర కూడా మనం నెమరువేసుకోవాలి. వారి జీవితాల నుంచి స్ఫూర్తిని పొందాల్సిన అవసరం ఉంది.నిమ్మకూరు అనే పల్లెటూరులో వెంకట్రామమ్మ,లక్ష్మయ్య చౌదరి దంపతులకు 1923 మే 28న జన్మించిన కారణజన్ముడు ఎన్టీఆర్. నేను ఆయనను కలిసి చాలాసార్లు మాట్లాడినప్పుడు... అప్పుడప్పుడు తన చరిత్రను, జీవితంలోని సంఘటనలను నాకు కొంచెం చెప్పేవారు. చదువు కోసం విజయవాడకు వచ్చేవారు. తెల్లవారుజామునే లేచి... తల్లికి సాయంగా అనేక పనులు చేసేవారు. పాలను విక్రయించేవారు... ఆ తర్వాత కాలేజికి వెళ్లేవారు. జీవితం మొదట్లో అందరికీ కష్టాలు ఉంటాయి... ఆ తర్వాత మనశక్తిని బట్టి మన జీవితాన్ని మలుచుకుంటాం.